క్లుప్తంగా

నేడు బహిరంగ వేలం

కేటీదొడ్డి: దీపావళి జాతర సందర్భంగా మండలంలోని వెంకటాపురం గ్రామంలోని వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో టెంకాయల విక్రయానికి సోమవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్న వేలంలో పాల్గొనాలని కోరారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ల దాతకు సన్మానం



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ ఆర్డీఎస్ సమీపంలో నిరుపేదల కోసం నిర్మించిన కల్యాణమండపానికి 21 ఫ్యాన్లు విరాళంగా అందజేసిన దాత చాకలి భీమన్నను జూలెకల్ భగత్‌సింగ్ యూత్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. సొంత ఖర్చులతో వితరణ చేయడం అభినందనీయమంటూ శాలువా, పూలమాలతో సన్మానించారు.

కూలిన కల్వర్టు గోడ

మానవపాడు: మండలంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెన్నిపాడు వద్ద డీ- 30 కాల్వ ఉన్న కల్వర్టు గోడ కూలిపోయింది. శిథిలాలు కాల్వలో అడ్డుగా పడటంతో చెన్నిపాడు, పెద్ద పోతులపాడు గ్రామాల పంట పొలాలకు నీరు పారడం లేదని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాల్వలో ఉన్న శిథిలాలు తొలగించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

కేటీదొడ్డిలో మోస్తరు వర్షం



కేటీదొడ్డి: మండల కేంద్రంలో ఆదివారం చిరు జల్లులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు మేఘావృతమై ఉండగా మోస్తారు పాటు వాన పడింది. సీడ్‌పత్తి సాగుకు ముసురు వర్షం ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

బ్రిడ్జి పూర్తయ్యేదెన్నడో?



ఉండవెల్లి: మండలంలోని బైరాపురంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి మూడేళ్లు దాటుతున్న పనులు మాత్రం పూర్తవడం లేదు. రూ.3 కోట్లతో నిర్మాణం చేపడుతున్న పనులు తుదిదశకు వచ్చిన కొన్ని పూర్తి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని బైరాపురం ప్రజలు కోరుతున్నారు.

చెట్టు కొమ్మే.. ప్రమాద సూచిక

మానవపాడు: మానవపాడు- గోకులపాడు రహదారిలోని వాగుపై ఉన్న కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు వాపోతునానరు. కల్వర్టుపై రంధ్రాలు, గుంతలు పడి ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు వద్ద ప్రమాద సూచికగా చెట్టు కొమ్మను ఏర్పాటు చేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సర్వీస్ రోడ్డుకు మోక్షమెప్పుడు?



అసంపూర్తిగా ఉన్న స్లాబ్ నిర్మాణం

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- రూ.37.67 లక్షలతో అంచనా
- అనుమతి పొందేందుకు ఆలస్యం
- ఐదేళ్లుగా మార్కెట్ నిర్వహణకు అడ్డంకులు

అయిజ: మున్సిపాలిటీలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్ సముదాయం) నిర్వహణకు మరో అడ్డంకి ఏర్పడింది. మార్కెట్ సముదాయాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన సర్వీసు రోడ్డుకు నిర్మాణానికి అడుగడుగునా అడ్డంకులు ఏర్పడుతూనే ఉన్నాయి. రోడ్డు నిర్మాణానికి ఆలస్యం అవుతుండటంతో మార్కెట్ ఎప్పుడు వినియోగంలోకి వస్తుందోనని మున్సిపల్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిక్కుముడులు వీడేనా...

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీలో మార్కెట్‌లో రూ.2 కోట్ల నిధులతో మొత్తం 40 గదులు నిర్మించారు. నిర్మాణం పూర్తయి అయిదు సంవత్సరాలవుతోంది. ఇంతవరకు వినియోగంలోకి రాలేదు. ఎప్పుడు సమీకృత మార్కెట్ సముదాయంను వినియోగంలేకి తేవాలన్నా సరే ఏదో ఒక సమస్య తలెత్తుతోంది.

అనుమతి వచ్చేందుకు ఆలస్యం

రూ.37.67 లక్షలతో సర్వీస్ రోడ్డు నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు సెప్టెంబర్ నెలలో అడిషనల్ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. ఇంతవరకు అది అనుమతి కాలేదు. కలెక్టర్ స్వయంగా పరిశీలించిన అనంతరం అవసరమైతేనే సర్వీస్ రోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇస్తానని చెప్పినట్లు సమాచారం. ఒకవేళ మున్సిపల్ అధికారులు పెట్టిన ప్రపోజల్‌ను అడిషనల్ కలెక్టర్ అనుమతి ఇచ్చినా సరే అప్పుడు ఆన్‌లైన్ టెండర్ నిర్వహించాల్సి ఉంటుంది. అనంతరం కాంట్రాక్టర్‌తో మున్సిపల్ అధికారులు అగ్రిమెంట్ చేసుకున్న అనంతరం సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. ఇలా ఎప్పటికి పనులు పూర్తయ్యేనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సమీకృత మార్కెట్‌ను వినియోగంలోకి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీర్చాలని ఇటు వ్యాపారులు, పట్టణ ప్రజలు కోరతున్నారు.



సర్వీస్ రోడ్డు నిర్మించాల్సిన ప్రదేశం

త్వరగా వినియోగంలోకి తేవాలి



రోడ్డు పక్కన వ్యాపారం చేయడం ఇబ్బందిగా ఉంది. చిన్న బంకు ఏర్పాటు చేసుకొని ప్రతి రోజు ఉదయం పండ్లు బయటికి తీసి రాత్రి సమయంలో మళ్లీ బంక్‌లో పెట్టి తాళం వేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంను వినియోగంలోకి తెస్తే దాంట్లో వ్యాపారం చేసుకుంటాం.

– వీరేష్, పండ్ల వ్యాపారి

అద్దెకు ఇవ్వాలి



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాలను వినియోగంలోకి తెచ్చి దుకాణాలకు వేలం పాల నిర్వహించి చిరు వ్యాపారులకు గదులు కేటాయిస్తామంటున్నారు. పేదరికంలో ఉన్న చిరు వ్యాపారులతో డిపాజిట్ చేయించుకోకుండా నెల వారీ అద్దెను వసూలు చేస్తే బాగుంటుంది.

– మహ్మద్ గౌస్, కూరగాయల వ్యాపారి

ప్రతిపాదనలు పంపాం



సర్వీసు రోడ్డు నిర్మాణానికి రూ.37.67 లక్షలకు అంచనా వేసి, అడిషనల్ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. ఇంకా అనుమతి రాలేదు. కలెక్టర్ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయితేనే మార్కెట్ ఉపయోగించుకోవడానికి వీలుగా ఉంటుంది.

– రాజశేఖర్, మున్సిపల్ ఏఈ, అయిజ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విశ్రాంత ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మల్దకల్: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 2001–02లో పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సమ్మేళనంలో విశ్రాంత ఉపాధ్యాయులు వీరన్న, వెంకట్రాము లు, వెంకటేశ్వర్లు, కళావతి, వరలక్ష్మి, మెర్సీ, అబ్దుల్‌మియాతో పాటు పలువురు ఉపాధ్యాయులు హాజరు కాగా పూర్వపు విద్యార్థులు వారికి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి మొమెంటో అందజేశారు. గత అనుభవాలను స్మరించుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో వీరేష్, నాగన్న, ప్రదీప్, వెంకట్, వినయ్ సుజాత, స్వాతి, లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా భీం ఆర్మీ



జెండా ఎగురవేస్తున్న ప్రకాష్

ధరూరు: పేద ప్రజలకు అండగా భీం ఆర్మీ ఉంటుందని భీం ఆర్మీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రకాష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో భీం ఆర్మీ జెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్, కాన్షీరాం ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామ గ్రామాన సామాజిక చైతన్యం తీసుకురావడంతో పాటు భీం ఆర్మీ ఛీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌రావణ్ నాయకత్వాన్ని నడిగడ్డలో బలపరచాలన్నారు. ఇంటింటికి భారత రాజ్యాంగం, కాన్షీరాం చిత్రపటాలను పంపిణీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధరూరు మండల అధ్యక్షుడిగా ఈదన్న, ప్రధాన కార్యదర్శిగా మార్లబీడు ఏసన్న, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా నర్సింహులు, కోశాధికారిగా నర్సింహ, ముఖ్య కార్యదర్శిగా ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులుగా సురేష్, సురేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో భీం ఆర్మీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకుండీలు కావివి.. నీటితొట్లు

- గ్రామాల్లో నిరుపయోగంగా మారిన వైనం

మల్దకల్: మండలంలోని బిజ్వారం, అమరవాయి, బూడిదపాడు, శేషంపల్లి, ఎద్దులగూడెం గ్రామాల్లో నిర్మించిన పశువుల నీటితొట్లు నిరుపయోగంగా మారాయి. నీటి తొట్లకు పైపులైన్ కనెక్షన్ లేకపోవడంతో గ్రామాల్లో చెత్తకుండీలుగా దర్శనమిస్తున్నాయి. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటితొట్లకు పైపులైన్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



అమరవాయిలో నిరుపయోగంగా నీటితొట్టి

వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలి



వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శాంతినగర్: వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకొని అందరూ ఎదగాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పైపాడు శ్రీనివాసులు అన్నారు. ఈ నెల 7న నిర్వహించే వాల్మీకి జయంతి వేడుకల నిర్వహణపై మండల కేంద్రంలో వాల్మీకి కులస్తులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ.. పదవులు చిన్నవైనా పెద్దవైనా ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. జయంతి వేడుకలు మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నాగరాజు, పరుషరాములును సన్మానించారు. కార్యక్రమంలో హుస్సేన్, తిమ్మప్ప, సంజన్న, అంజి, నరసింహులు, జయన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి



గద్వాలటౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని నాయకుడు హనుమంతునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం గద్వాలలో వివిధ పార్టీలకు చెందిన పలువరు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం హనుమంతునాయుడు మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపు కోసం పాటుపడాలన్నారు. గెలిచిన ప్రతిచోట భారీ మెజార్టీ నమోదు కావాలన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. బీఆర్ఎస్ ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వెంకటేష్‌నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి, శ్రీరాములు, భరత్, చిన్నయాదవ్, రాము తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై తాత్కాలిక మరమ్మతు



అయిజ: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణ సమీపంలోని పెద్దవాగుపై ఉన్న వంతెనకు రంధ్రం పడింది. ఆదివారం ఆర్అండ్‌బీ ఏఈ అల్తాఫ్ కాంట్రాక్టర్‌తో కలిసి వంతెనపై తాత్కాలిక మరమ్మతు పనులు చేయించారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు



ఎర్రవల్లి: జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడటంతో నలుగురికి గాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ మురళి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ముంద్ర రాజీవ్, సోదరుడు రవీంద్ర, సోదరుడి కుమారుడు దయ, మరో వ్యక్తి అశోక్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి కారులో బెంగళూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలో డ్రైవర్ అజాగ్రత్త కారణంగా కారు అదుపుతప్పి ఒక్కసారిగా పల్టీలు కొడుతూ బోల్తా పడింది. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు కావడంతో అందులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కారు యజమాని రాజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి



అయిజ మండలం మూగోనిపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



కేటీదొడ్డిలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

కేటీదొడ్డి: గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు బీజేపీ నుంచి పోటీలో ఉండి ప్రతి స్థానాన్ని ఖచ్చితంగా గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, నాయకులు కిష్టన్న, హన్మిరెడ్డి, భీమిరెడ్డి, అశోక్, రాములు, రాముడు, కృష్ణకాంత్, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ ప్రచారం

అయిజ: మండలంలోని మూగోనిపల్లిలో బీజేపీ నాయకులు గడపగడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేద ప్రజలందరికి ఉపయోగపడేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. గ్రామ పంచాయతీలు అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి నేరుగా నిధులు విడుదల చేస్తుందన్నారు. సీసీరోడ్లు, రైతువేదికలు, ఉచిత సన్నబియ్యం, ఆయుష్మాన్ భారత్, అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పరుశురాముడు, వీరాంజనేయులు, తిరుమలేష్, రాజు, సవారన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు పేదలకు వరం

గద్వాలటౌన్: ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు వరమని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సుదర్శన్, జిల్లా కన్వీనర్ సాయిప్రకాష్ అన్నారు. భగవాన్ శ్రీసత్య సాయిబాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సత్య సాయి సేవా మందిరంలో ఆదివారం ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కర్నూల్‌కు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణుడు అనిల్‌కుమార్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని, సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు, పేద ప్రజల సంక్షేమం కోసం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉన్నత స్థానంలో స్థిరపడిన వారు సమాజం కోసం తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాలకు సమయాన్ని కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి నాయకులు తారనాథ్, సోమసుందర్‌గౌడ్, పుల్లయ్యగౌడ్, జయలక్ష్మి, ప్రేమలత, సాయిలక్ష్మి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆదమరిస్తే అంతే సంగతులు



మల్దకల్‌లో కూలీలను తరలిస్తున్న వాహనం



ఎల్కూరులో..

- యథేచ్ఛగా గూడ్స్ వాహనాల్లో కూలీల తరలింపు
- నిబంధనలు లెక్క చేయని వాహనదారులు
- ప్రమాదం జరిగితే భారీగా ప్రాణనష్టం

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రైవేటు గూడ్స్ వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గట్టు, కేటీదొడ్డి, అయిజ మండలాల నుంచి నిత్యం 30కు పైగా గూడ్స్ వాహనాల్లో కూలీలను చేరవేస్తున్నారు. ఒక్కో వాహనంలో 30 నుంచి 50 మంది కూలీలను చేరవేస్తుండడంతో చిన్నపాటి ప్రమాదం జరిగినా భారీగా ప్రాణనష్టం జరిగే ప్రమాదముందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రైవేటు గూడ్స్ వాహనదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సూచిక బోర్డులు కరువాయె!

ఇటిక్యాల: జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మలుపులలో ప్రయాణించాలంటే నిత్యం వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధిక సంఖ్యలో మలుపులు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు. మలుపుల వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులు లేవని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



ఇటిక్యాల రోడ్డులో సూచిక బోర్డులు లేని మలుపు

చెరువులకు జలకళ



అలుగు పారుతున్న గట్టు చెరువు

- రెండో ఏడాది సెప్టెంబర్‌లోనే నిండిన వైనం
- ఆనందంలో ఆయకట్టు రైతులు

గట్టు: మండలంలోని చెరువులకు జలకళ సంతరించుకుంది. ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురువడంతో చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. ముఖ్యంగా గట్టు, సల్కాపురం చెరువులు ఈ ఏడాది కూడా నిండి అలుగు పారాయి. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువులు వానాకాలంలో నిండినప్పటికీ యాసంగిలో మాత్రమే ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారు. సెప్టెంబర్ చివరి వారంలో గట్టు పెద్ద చెరువు నిండి అలుగు పారగా, వారం రోజుల వ్యవధిలో గట్టు చెరువుపై భాగంలో ఉన్న సల్కాపురం చెరువు కూడా అలుగు పారింది. గతేడాది సెప్టెంబర్ నెల మొదటి వారంలో గట్టు చెరువు నిండగా, ఈ సారి చివరి వారంలో చెరువు నిండి అలుగు పారింది. గట్టు చెరువు 4 ఏళ్ల విరామం (2020)తర్వాత 2024 సెప్టెంబర్ నెల మొదటి వారంలో, 2025లో సెప్టెంబర్ చివరి వారంలో పూర్తిస్థాయిలో నిండి అలుగు పారింది. గట్టు చెరువు కింది 300 ఎకరాల ఆయకట్టు సాగవుతుండగా, సల్కాపురం చెరువు కింద 150 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. గట్టు, సల్కాపురం చెరువులు వర్షాధారంగానే నిండుతాయి. మాచర్ల చెన్నకేశవ స్వామి చెరువుకు 60 శాతం మేర నిండింది. బల్గెర చెరువుకు నెట్టెంపాడు కాల్వ నీటిని విడుదల చేస్తారు. ఈ రెండు చెరువులు నిండితే భూగర్భ జలాలకు కొదవ ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే సల్కాపురం, గట్టు, మాచర్ల చెరువులకు నెట్టెంపాడు కాల్వ నీటితో నింపాలని చాలా కాలంగా ఇక్కడి రైతాంగం కోరుతున్నారు.



అలుగు పారుతున్న సల్కాపురం చెరువు